## చిన్నముష్టూరు, షేక్షానుపల్లిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

**- కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించిన అధికారులు**

ఉరవకొండ, డిసెంబర్ 6 ప్రభాతవార్త



వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో మాట్లాడుతున్న ఎంపీడీఓ యం.డి.అమృత్‌రాజ్

మండల పరిధి లోని చిన్నముష్టూరు. షేక్షానుపల్లి గ్రామాల్లో బుధవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కొనసాగింది. గ్రామం లోని ప్రధాన కూడళ్ల లో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ, మండల నోడల్ అధికారి యం.డి.అమృత్‌రాజ్‌తోపాటు వివిధ శాఖల అధికారులు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్య క్రమాల గూర్చి ప్రజలకు వివరించారు. ఆయా పథకాల ద్వారా ఎంతమంది లబ్దిపొందారో వివరించి లబ్దిపొందని వారి వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు రామాంజినేయులు, లింగన , ఈఓఆర్డీ పి.చంద్రమౌళి, మండల విద్యాధికారి హెచ్.ఈశ్వరప్ప, మండల వ్యవసాయాధికారి జి.శుభకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పి.ఫమిదా పరుమ్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ బి.విమల, డీఆర్‌డీఏ వైకేపీ ఏపీఎం శివయ్య, సీఎస్‌డీటీ కంబక్క, కెనరా బ్యాంకు ఎన్.భ్రమరాంబిక పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

## మంచి జరిగిందనుకుంటే జగన్‌ను మరొకసారి ఆశీర్వదించండి

**-షేక్షానుపల్లి గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం**

ఉరవకొండ, డిసెంబర్ 6 ప్రభాతవార్త



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈఓఆర్‌డీ పి.చంద్రమౌళి

రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వై.ఎన్.జగన్మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాల ద్వారా మంచి జరిగిందని అనుకుంటే ఆయన్ను మరోమారు ఆశీర్వదించాలని ఎంపీపీ యం.నరసింహులు, వైస్ ఎంపీపీ వై.శ్రీనాథ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని షేక్షానుపల్లి గ్రామంలో బుధవారం గ్రామం సర్పంచ్ లింగన్న అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం అట్టహాసంగా జరుగగా వారితోపాటు ఈఓఆర్‌డీ పి.చంద్రమౌళి, వైసీపీ రూరల్ మండల అధ్యక్షులు బోయ సుంకన్న, పట్టణ అధ్యక్షులు ఏ.సి.ఎర్రిస్వామి, మండల సమన్వయకర్త మూలగిరిపల్లి ఓబన్న తదితరులు హాజరయ్యారు. తొలుత గ్రామంలో పార్టీ జండాను అనంతరం గ్రామ సచివాలయంవద్ద సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించే బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో వక్తలు మాట్లాడుతూ సీయం వై.ఎస్.జగన్ గడిచిన నాలుగున్నరేళ్లలో ప్రజలకు డీబీటీ, నాన్ డీబీటీ కింద దాదాపు 4.5 లక్షల కోట్ల రూపాయలను అందించారన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## సురక్షితంకాని లైంగిక సంబంధాల ద్వారా ఎయిడ్స్ వ్యాప్తి

**-చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ డీఆర్‌పీ రమేష్‌యాదవ్**

ఉరవకొండ, డిసెంబర్ 6 ప్రభాతవార్త




అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ డీఆర్‌పీ రమేష్‌యాదవ్

సురక్షితంకాని లైంగిక సంబంధాలు తదితర వాటివల్ల ఎయిడ్స్ వ్యాప్తి చెందుతుందని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ డీఆర్‌పీ రమేష్ యాదవ్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌యాదవ్ మాట్లాడుతూ కలుషిత సూదులు, సిరంజీల ద్వారా, కలుషిత రక్త మార్పిడి, హెచ్‌ఐవీ సోకిన తల్లిదండ్రుల నుండి బిడ్డకు ఎయిడ్స్ సంక్రమిస్తుందన్నారు. హెచ్‌ఐవీ సోకిన వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన సవివరించారు. సెరికల్చర్ అధ్యాపకులు కె.వి.ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ హెచ్‌ఐవీ ఎయిడ్స్‌పై యువత అవగాహన కలిగి ఉండాలన్నారు. చెడు సావాసం, సామాజిక మాధ్యమాల వల్ల యువత ఎక్కువగా చెడు మార్గంలో పయణిస్తోందని వివరించారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ఖాధర్‌ఖాన్ మాట్లాడుతూ జీవితంలో క్రమశిక్షణ చాలా అవసరమని అప్పుడే భవిష్యత్తు సురక్షితంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ పెద్దన్న, చైల్డ్ లింక్ వర్కర్ స్కీమ్ డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్స్ నాగరాజు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీపీ యం.నరసింహులును సన్మానించిన దేవాంగ సంక్షేమ సంఘం

**-మరిన్ని ఉన్నత పదవులు అదీష్టించాలని ఆకాంక్ష**

ఉరవకొండ, డిసెంబర్ 6 ప్రభాతవార్త



ఎంపీపీ యం.నరసింహులును సన్మానించి జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

ఉరవకొండ నూతన మండలాధ్యక్షుడు యం.నరసింహులును బుధవారం దేవాంగ సంక్షేమ సంఘం ఘనంగా సన్మానించింది. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీపీ ఛాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు చంగల మహేష్ సంఘం ఇతర బాధ్యులతో కలిసి ఎంపీపీ యం.నరసింహులుకు షాలువాకప్పి పూలమాలలతో సన్మానించి జ్ఞాపికను అందించారు. మరిన్ని ఉన్నత పదవులు అదిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘం బాధ్యులు మిడతల విశ్వనాథ్, సాదు వెంకటస్వామి, యం.సి.నాగభూషణ, నిమ్మల వెంకటరమణ, రెడ్డి ఆంజినేయులు, పోసా రామాంజినేయులు, కొత్త మురళి, కటికం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అలుపెరుగని కృషి బిఆర్ అంబేద్కర్...

కణేకల్లు, డిసెంబర్ 06 ప్రభాతవార్త:

భారత రాజ్యాంగ రూపకర్త, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అలుపెరగని కృషి చేసిన మహనుభావుడు డాక్టర్ బిఆర్. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం కణేకల్లు మండలంలోని కొత్తపల్లి గ్రామంలో డాక్టర్ బిఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జోహార్ జోహార్ అంబేద్కర్ అంటూ నినాదాలు చేస్తూ స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం అనంతపురం జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల ప్రసాద్ మాట్లాడుతూ డాక్టర్ బిఆర్. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం తోనే నేటికి కూడా బడుగు, బలహీన, వెనుకబడిన ప్రజలకు అంతో ఇంతో న్యాయం జరుగుతుందన్నారు. నేటి పాలకుల దురాక్రతలను ఆనాడే అంబేద్కర్ గమనించి అందరికి సమపాలలో రాజ్యాంగాన్ని రచించాడన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్, గోపాల్, మీసాల తిమ్మప్ప, కిష్టప్ప, రవి, రాజయ్య, పోతన్న, ప్రసాద్, తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి జగన్‌కు మా గోడు వినిపించడంలేదు..!

**-సత్యాగ్రహ దీక్షలో అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్**

ఉరవకొండ, డిసెంబర్ 6 ప్రభాతవార్త



సత్యాగ్రహ దీక్ష చేపట్టిన అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ బాధ్యులు

అధికారం చేపట్టిన వారం రోజుల్లో 1,183 కోట్ల రూపాయలు విడుదలచేసి 20వేల రూపాయల లోపు పొదుపు చేసుకున్న 14 లక్షల మందికి సంపూర్ణ న్యాయం చేస్తామని ప్రతిపక్ష నాయకుడి హోదాలో 2017 మార్చి 23న బాధితుల సభలో ప్రకటించిన వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చి ఐదు సంవత్సరాలు కావస్తుండగా అగ్రిగోల్డ్ బాధితుల గోడు మాత్రం పట్టడంలేదని అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ అసోసియేషన్ వాపోయింది. డిపాజిటర్ల, ఏజెంట్ల ఆత్మగౌరవం కాపాడాలని, డిపాజిట్ సొమ్ము సర్వతం ఇప్పించాలని, బాధితులకు న్యాయంచేసి ఇచ్చినమాట నిలబెట్టుకోవాలని, పేదల కష్టార్జితాన్ని కొల్లగొట్టిన అగ్రిగోల్డ్ కంపెనీ యాజమాన్య దొంగన్ని శిక్షించాలన్న డిమాండ్‌తో అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని మండల తహశీల్దార్ కార్యాలయ ఆవరణంలో బుధవారం సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. దీక్షా శిబిరాన్ని సందర్శించి సీపీఐ, సీపీఎం నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సిద్దేశ్వర మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి మాటలు నమ్మి ఓట్లు వేసి గెలిపించిన లక్షలాది మంది అగ్రిగోల్డ్ బాధితుల ఆక్రందనలు ముఖ్యమంత్రికి, మంత్రులు, శాసన సభ్యులు, పార్లమెంటు సభ్యులకు వినిపించడంలేదని ఎద్దేవా చేశారు. మాట తప్పను, మడమ తిప్పను అంటే ఇదేనా అన్ని ప్రశ్నించారు. నాడు ఇచ్చిన హామీ మేరకు చనిపోయిన బాధిత కుటుంబాలకు పెంచి ఇస్తామన్న 10 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ మండల అధ్యక్షుడు తిమ్మరాజు, బాధితులు మల్లేష్, ప్రభాకర్, గౌరప్పన్న, పురుషోత్తం, అచ్యుతరావు, ప్రకాష్, తుకారాం, రంగస్వామి, నాగరాజు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మల్లికార్జున, నాయకులు సుల్తాన్, వన్నూరమ్మ, సీపీఎం నాయకులు మధుసూదన్, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు దాటుతున్న వ్యక్తిపై దూసుకెళ్లిన కారు..వ్యక్తి అక్కడికక్కడే మృతి

అగళి, డిసెంబర్ 6 ప్రభాతవార్త



రోడ్డుప్రమాదం జరిగిన దృశ్యం

మండల పరిధిలోని రామనపల్లి జాతీయ రహదారిపై బుధవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో రొళ్ల పక్క నుంచి అగళి వైపు వస్తున్న కారు వేగంగా రోడ్డు దాటుతున్న వ్యక్తిపై దూసుకెళ్లడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రామన పల్లి గ్రామానికి చెందిన నరసింహప్ప కుమారుడు రమేష్ (45) తన ఇంటి వద్ద నుంచి వేరుశనగ కట్టె, చెత్తను తీసుకుని కుప్పలోనికి వేయడానికి రోడ్డు దాటుతుండగా రొళ్ల వైపు నుంచి వచ్చిన కారు వేగంగా అతన్ని ఢీ కొట్టడంతో రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ లావణ్య, ఏఎస్ఐ బషీర్, కానిస్టేబుల్ శివన్న సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. కారు ఢీ కొట్టి డ్రైవర్ పరారీ అవ్వడంతో కర్ణాటక రాష్ట్రం బరుగూరు వద్ద ప్రమాదం చేసిన కారుతోపాటు డ్రైవర్ వంశీకుమార్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అతివేగమే ప్రమాదానికి కారణమని, వాహన చోదకులు తమ వాహనాలను తక్కువ వేగంతో నడపాలని ఎస్ఐ ఈ సందర్భంగా తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామంలోకి ప్రవేశించే రహదారిపై స్పీడు బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు లేని కారణంగా కూడా ఈ ప్రమాదం చోటు చేసుకుందని వెంటనే ఏర్పాటు చేయాలని వారు కోరారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరానికి విశేష స్పందన

**-స్వచ్ఛంధంగా రక్తదానం చేసిన 60 మంది విద్యార్థులు**

ఉరవకొండ, డిసెంబర్ 6 ప్రభాతవార్త



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు యాజమాన్యం కళాశాల ఎన్ఎస్ఎస్, ఆర్ఆర్‌సీ, ఎన్‌సీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన కనిపించింది. విద్యార్థులు 60 మంది స్వచ్ఛంధంగా రక్తదానం చేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎన్.కె.అరుణజ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన యుపీఎస్ సీఐ యం.తిమ్మయ్య మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని అన్ని దానాల్లోకి రక్తదానం ఎంతో గొప్పదన్నారు. అపోహాలు విడనాడి అందరూ రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు డిప్యూటీ మేనేజర్ జి.అరవిందకుమార్ మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో రక్తదానం చేయడంవల్ల ప్రాణాలను నిలబెట్టవచ్చని రక్తదానం వెలకట్టలేనిదన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ఎన్.కె.అరుణజ్యోతి మాట్లాడుతూ 18 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల వయసులోపు ఆరోగ్యవంతులైన ఎవరైనా రక్తదానం చేయవచ్చన్నారు. వైద్యాధికారి డాక్టర్ శంకర్‌గౌడ్ మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండటానికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా॥బి.వెంకటరాముడు, ఎన్.ఎ.అల్తాఫ్, ఆర్ఆర్‌సీ కో ఆర్డినేటర్ డా॥డి.ఆదినారాయణ,ఎన్‌సీసీఆఫీసర్‌డి.ప్రశాంత్,అధ్యాపకులు పాల్గొన్నారు.

## భార్యను చంపిన భర్త

పుట్టపర్తిటౌన్, డిసెంబర్ 06, ప్రభాతవార్త



హత్యగావింపబడ్డ రత్నమ్మ మృతదేహం

భార్యను భర్తే కిరాతకంగా చంపిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. బంధువులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలుఇలాఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లిలో రామకృష్ణ తన భార్య రత్నమ్మ(45)ను హత్యచేసినట్లు తెలిసింది. మంగళవారం రాత్రి రామకృష్ణ మరోస్త్రీతో అక్రమసంబంధం పెట్టుకున్నవిషయం ఆమెకు తెలియడంతో ప్రత్యక్షంగాచూడాలని ఆమెఇంటికి రత్నమ్మ వెళ్ళడంజరిగింది. అక్కడ భాగోతం బయటపడడంతో రామకృష్ణ రత్నమ్మను కొట్టుకుంటూ ఇంటికి తీసుకెళ్ళాడు. అక్కడ ఇనుప రాడ్డుతో తలమీద మోదడంతో ఆమె బాధగా అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందింది. అయితే ఆమెమిద్దె మెటుకులపై నుండిజారిపడినట్లు చిత్రీకరించడానికి రామకృష్ణ ప్రయత్నించినట్లు తెలిపారు. అనంతరం పోలీసులు విచారించగా తానే చంపినట్లు ఒప్పుకున్నట్లు తెలియజేశారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ కొండారెడ్డి తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం ఆమె మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

**నివాళులర్పించిన మాజీ మంత్రి పల్లె :** ఎనుములపల్లి గ్రామంలో బిసి కాలనీకి చెందిన రత్నమ్మ హత్యగావించబడడంతో మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి విషయం తెలుసుకొని వారి ఇంటి వద్దకు వెళ్ళి మృతురాలి పార్థివ దేశానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంరతం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సంఘటన వివరాలు అడిగి తెలుసుకొని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## ఘనంగా అంబేద్కర్ వర్ధంతి

పుట్టపర్తి, డిసెంబర్ 06, ప్రభాతవార్త



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఇఓ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

డాక్టర్ బి.ఆర్.అం బేద్కర్ 67వ వర్ధంతిని పుట్టపర్తి మండల వనరుల కేంద్రం నందు ఎంఇఓ బి.ప్రసాద్‌తో పాటు ఉపాధ్యాయ సంఘాల నాయకులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ భారత రాజ్యాంగం సృష్టికర్తగా, స్వాతంత్ర సమరయోధుడిగా దేశానికి అందించిన సేవలను కొనియాడారు. అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించి సమసమాజ స్థాపనకు అంబేద్కర్ చేసిన కృషిని కొనియాడారు. వైఎస్ఆర్‌టిఎఫ్ జిల్లా కార్యదర్శి పి.వి.రమణారెడ్డి, పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు రజనీకాంత్ రెడ్డి, బి.వెంకటరత్నం, ఉపాధ్యాయులు కేశవాచారి, రాజశేఖర్, ఎం.ఆర్.సి సిబ్బంది, వనిత, ఓబులేసు, వజ్రానాయక్, ప్రశాంతి, నాగరాజు, రామ్మోహన్, రవి, శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా వికలాంగుల దినోత్సవం :** పుట్టపర్తిలోని భవిత కేంద్రం నందు అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు జగదీష్ ఆధ్వర్యంలో ఎంఇఓ ప్రసాద్, వైఎష ఆర్‌టిఎఫ్ నాయకులు పి.వి.రమణారెడ్డి, ఎన్.రజనీకాంత్‌రెడ్డి, వెంకటరత్నం, భవిత సిబ్బంది పాల్గొని పిల్లలతో కేక్‌కట్ చేయించి తినిపించారు. ఈ సందర్భంగా పిల్లలకు మిఠాయిలు, పలకలు, నోటుపుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌సి సిబ్బంది, పిల్లల తలిదండ్రులు పాల్గొన్నారు.

## భావితరాలకు ఆదర్శప్రాయుడు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్

శ్రీసత్యసాయిజిల్లా, డిసెంబర్ 06, ప్రభాతవార్త ప్రతినిధి:



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నవభారతావనికి ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజా స్వామ్య దేశానికి రాజ్యాంగాన్ని అందించి భావితరాలకు ఆదర్శప్రాయుడుగా డా.బి.ఆర్.అంబేద్కర్ కీర్తి శిఖరాన్ని అధిష్టించారని జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ, సాధికారత అధికారి శివరంగ ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం పుట్టపర్తిలోని తన కార్యాలయంలో డా.బి.ఆర్.అంబేద్కర్ 67వ వర్ధంతిని తన కార్యాలయంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మోహన్‌రామ్, ఉద్యోగ సిబ్బంది తదితరులతో కలసి అంబేద్కర్‌చిత్రపటానికి పూలమాలలు వేసి గనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని వర్గాల అభ్యున్నతికి బాటలు వేసి, నవసమాజ నిర్మాణంకోసం పాటుపడిన డా.బి.ఆర్.అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు శ్లాఘనీయమన్నారు. అసమానతలు, అంటరానితనాన్ని రూపుమాపి, తన మేధోసంపత్తితో భరతజాతిని జాగృతం చేసి సామాజిక రుగ్మతలను రూపుమాపారని,ఆయన ఆశయాలను కొనసాగించేందుకు మనమందరం కృషి చేయాలన్నారు.

## సమగ్ర శిక్ష ఉద్యోగులకు అందని వేతనాలు...

కణేకల్లు, డిసెంబర్ 06 ప్రభాతవార్త:

వివిధ శాఖల్లో ఉద్యోగులకు సరిగా జీతాలు అందక ఆకలి కేకలు పెడుతున్నారని పిడిఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ. సమగ్ర శిక్ష ప్రాజెక్టు పరిధిలో పనిచేసే ఉద్యోగుల ఆకలి కేకలు ప్రభుత్వానికి వినిపించడం లేదన్నారు. ఒక నెల జీతం రాకుండానే రెండో నెల మొదటి వారంలోని అప్పుల కోసం, ఆదుకునే మిత్రుల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. సగటు ఉద్యోగులు ఎవరైనా ఇదే పరిస్థితి నెలకొందన్నారు. అలాంటిది ఏకంగా మూడు నెలల నుంచి జీతాలఉ అందకుంటే ఆ బాధలఉ వర్ణించలేమన్నారు. సమగ్ర శిక్ష ప్రాజెక్టు పరిధిలో పనిచేసే వందలాది మంది ఉద్యోగులకు ఇప్పుడు ఈ అవస్థలు తప్పడం లేదన్నారు. సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ జీతాలు ఇప్పటివరకు ప్రభుత్వం చెల్లించలేదన్నారు. మరో వైపఉ కేజీబివిల నిర్వహణకు అందించే డైట్ బిల్లులు కూడా మూడు నెలల నుంచి పెండింగ్లో ఉన్నాయన్నారు. దీంతో కేజీబివి ప్రిన్సిపాళ్ల వందలాది మంది విద్యార్థులకు డైట్ అందించేందుకు అప్పులు చేయాల్సి వస్తోందన్నారు. మూడు నెలలుగా జీతాలు, డైట్ బిల్లులు పెండిగ్లో ఉంచడం పై జగన్ సర్కారుపై ఉద్యోగ సంఘాల నాయకులు మండిపడుతున్నారన్నారు. ఈ నెలలో చలో విజయవాడ తోపాటు సమ్మెబాట తో రూ.9.60కోట్ల బకాయిలు జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు పరిధిలో ఉన్న కేజీబివిలో, మండల రిసోర్స్ కేంద్రాల్లో పనిచేసే ఉద్యోగులకు మూడు నెలల నుంచి జీతం అందడం లేదని, జిల్లా ప్రాజెక్టు పరిధిలో ఉండే మండల రిసోర్స్ కేంద్రాల్లో సిఆర్‌పిలు, పీటిఐలు, ఎంఐఎస్, కోఆర్డినేటర్లు డేటా ఎంట్రి ఆపరేటర్లు, మెసెంజర్లు, అకౌంటెట్లు, కేజీబివి ప్రిన్సిపాళ్లు, సిఆర్జీలు, పిఈటిలు, పిజిటిలతో పాటు, ఎఎన్ఎంలు, అకౌంటెంట్లు, కంప్యూటర్ ఇన్స్ట్రక్టర్లు, అటెండర్లు, ఇతర విభాగాల ఉద్యోగులు పనిచేస్తూ ఉంటారన్నారు. సుమారఉ 1300 మంది నుండి 1400మందంది పనిచేస్తుంటారని, వీరికి నెలకు రామారమి రూ.3.20కోట్ల వరకు జీతాలు చెల్లించాలి, వారికి ప్రభుత్వం సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలల జీతాలు పెండిగ్లో ఉన్నాయన్నారు. ఇదీ ప్రభుత్వ వైఫల్యమన్నారు. కేజీబివిలో వేలాది మంది బాలికలు చదువుకుంటున్నారని, వారికి చదువులు చెప్పే ప్రిన్సపాళ్ల, ఇతర టిచింగ్ స్టాఫ్‌కు సకాలంలో జీతాలు ఇవ్వలేకపోవడం నిజంగా ప్రభుత్వ వైఫల్యమే అన్నారు. మూడు నెలల జీతాలు ఇవ్వకుండా, డైట్ బిల్లులు చెల్లించకుంటే కేజీబీవి మనుగడ కష్ట సాధ్యమన్నారు. మండలంల్లో సైతం చాలీ చాలని జీతాలు నెట్టుకొస్తున్న ఎమ్మార్సీ స్టాఫ్‌కు సైతం జీతాలఉ పెండింగ్లో ఉంచడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జీతాలు, డైట్ బిల్లులు చెల్లించాలని, పెండింగ్లో ఉన్న బిల్లులు వెంటనే ప్రభుత్వం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఘనంగా అంబేద్కర్ వర్ధంతి వేడుకలు..

కణేకల్లు, డిసెంబర్ 06 ప్రభాతవార్త:



అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం..

భారతీయ జనతాపార్టీ కణేకల్లు మండలశాఖ ఆధ్వర్యంలో బిఆర్ అంబేద్కర్ 67వ వర్ధంతిని నివాళులు అర్పించి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు మల్లయ్య చౌదరి మాట్లాడుతూ భారతరత్న రాజ్యాంగ రూపకర్త బిఆర్ అంబేద్కర్ యొక్క సేవలు ఈ దేశానికి బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఆశాజ్యోతిగా నిలిచారన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మాజీ జిల్లా కార్యదర్శి ఒరుగంటి తిమ్మారెడ్డి, స్టేట్ కౌన్సిల్ మెంబర్ ఎర్రిస్వామిరెడ్డి, మండల అధ్యక్షుడు మల్లయ్య చౌదరి, మహిళా నాయకురాలు అరుణారెడ్డి, రమేష్‌రెడ్డి, నాగబూషణ తందిదరులు పాల్గొన్నారు. అదే విధంగా రేపు కళ్యాణదుర్గంలో అనంతపురం జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసులు అధ్యక్షతన జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జాతీయ కార్యదర్శి రాయలసీమ ముద్దుబిడ్డ వైసత్యకుమార్ యాదవ్, పాల్గొంటారని, మండలంలో అధ్యక్షుడు, ఆ పైస్థాయి నాయకులందరూ పాల్గొనాలని కోరారు.

## న్యాయం జరగాలంటూ కదిరికి పాదయాత్ర



కదిరి దేవస్థానానికి పాదయాత్రగా వెళుతున్న సాయి

**కొత్తచెరువు, డిసెంబర్ 06, ప్రభాతవార్త** తమకు రావాల్సిన అంగన్‌వాడీ పోస్టును అధికార పార్టీ ప్రోద్బలంతో మరొకరికి కట్టబెట్టారని, తమకు న్యాయం జరగాలని కోరుతూ వైఎస్ఆర్‌సిపి కార్యకర్త దంపతులు కదిరి లక్ష్మినరసింహస్వామి దేవస్థానంకు పాదయాత్రగా బయలుదేరి వెళ్ళారు. మండలకేంద్రమైన కొత్తచెరువులోని ధర్మవరం రహదారిలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత వైఎస్ఆర్ సిపి కార్యకర్త సాయి తన భార్య మమతకు అంగన్ వాడీ సెంటర్ -2లో ఆయాగాపని చేస్తోందని, అయితే తన భార్యకు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ ఓ ప్రజా ప్రతినిధి ఒత్తిడి మేరకు ఆమెకు రావాల్సిన అంగన్‌వాడీ పోస్టును స్థానికేతరులకు కట్టబెట్టారని,దీనిపై పలుమార్లు ఐసిడిఎస్ పిడి, కలెక్టర్, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా ప్రయోజనలేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు నిరసనగా అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికినివాళులర్పించి కదిరిలక్ష్మినరసింహ స్వామి దేవస్థానంకు పాదయాత్రగా వెళుతున్నట్లు తెలియజేశారు. ఇప్పటికైన భగవంతుడు వారికి సద్బుతిని ప్రసాదించి దళితులైన తమకు అన్యాయం జరగకుండా కాపాడాలని అతను కోరాడు.

## చంద్రబాబుతోనే భవిష్యత్తుకు గ్యారెంటి... యూనిట్ ఇన్చార్జి చాంద్‌బాషా, ముజ్జు

కణేకల్లు, డిసెంబర్ 06 ప్రభాతవార్త:

మండల కేంద్రంలో 124బూత్‌లో బుధవారం తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో బాబు ష్యూరిటి భవిష్యత్తుకు గ్యారెంటి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంచారు. నాయకులు మాట్లాడుతూ బాబు తోనే భవిస్యత్తు గ్యారెంటి ఉంటుందని తెలుగుదేశం పార్టీ మినీ మేనిపెస్టోని ప్రజలందరూ అర్థం చేసుకొని 2024లో తెలుగుదేశం పార్టీకి సహకరించాలని, గత ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ హయాంలో రోడ్లు, నిత్యావసర సరుకుల ధరలు ప్రజలకు అందుబాటులోనే ఉండేవని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్ ఏ.రసూల్‌సాబ్, యూనిట్ ఇంచార్జీ చాంద్‌బాషా, షేక్ ముజ్జు, ఐటిడిపి కోరి శేఖర్, బూత్ కన్వీనర్ గామేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## 13 మందికేనా రౌండ్ టేబుల్ సమావేశం

**- ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతర్**

**- రాని వారిని మేలు ఏం చేయలేం - ఎంపిడిఓ**

గుమ్మఘట్ట, డిసెంబర్ 6 ప్రభాతవార్త



ఖాలీ కుర్చీలతో దర్శనమిస్తున్న సమావేశం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేయబడుతున్న కులగణన కార్యక్రమంను పారద్శకంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ గౌతమి ఆదేశాలు ఉన్నప్పటికీ ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేపట్టాలని ఎట్టి పరిస్థితుల్లోనూ సర్వేలు ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా సంబంధిత శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని సర్వేలో పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని సీరియస్‌గా ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశాలను లెక్క చేయకుండా రౌండ్‌టేబుల్ సమావేశానికి మండల వ్యాప్తంగా 13 మంది మాత్రమే రావడం గమనార్హం. అందరికీ సమాచారం అందించాము ఎవరు రాకపోతే మేమేం చేయాలని అంటూ ఎంపిడిఓ ప్రభాతవార్తకు సమాచారం ఇచ్చారు. మండలకేంద్రంలో బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 12 గంటల సమయంలో పదిమందితోనే రౌండ్ టేబుల్ సమావేశంను ఎంపిడిఓ నరసింహమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ నరసింహమూర్తి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వంప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కార్యక్రమంను సమగ్ర కుల గణనా సర్వే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 10వ తేది నుంచి 18వ తేది వరకు అన్ని గ్రామాల సచివాయాల్లో సచివాలయ సిబ్బంది ద్వారా, వాలెంటర్లీ ఆధ్వర్యంలో ఈ కుల గణన కార్యక్రమంను జరిపిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డి సురేష్‌బాబు, సర్పంచులు అనీల్‌కుమార్, రాజేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మహాశక్తితో మహిళల జీవితాల్లో వెలుగు ఉన్నం వరలక్ష్మి..

బ్రహ్మసముద్రం, డిసెంబర్ 6 ప్రభాతవార్త

మండల పరిధిలోని కన్నేపల్లి, ముద్దలాపురంగ్రామాల్లో తెలుగుదేశంపార్టీప్రకటించిన భవిష్యత్ గ్యారెంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో భాగంగా తెలుగు మహిళ ఉన్నం వరలక్ష్మి, కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా చంద్రబాబునాయుడు తిరిగి ముఖ్యమంత్రి కావాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ, మహిళలు ప్రతి ఇంటికీ చీర, గాజులు, పసుపు కుంకుమలను, ప్రతి ఇంటికీ పంపిణీ చేశారు. అనంతరం ఉన్నం వరలక్ష్మి ప్రతి ఇంటికీ వెళ్లి అందరితో మమేకమవుతూ వయోభారంతో ఉన్న వారికి పెన్షన్ దూరం, డిగ్రీలు తీసుకున్న యువతకు ఉద్యోగ ప్రకటనలు రాక నిరుత్సాహంతో వాళ్లకు భరోసా, ఫీజు భారం వృద్ధాప్యంలో ఆర ఇథక ఆసరా కరువు, మహిళలకు అందని ప్రోత్సాహం వీటన్నింటిని మరిచిన ఈ వైకాపా పాలనకు చరమగీతం పాడుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి రాయలు శ్రీనివాసులు, కన్నేపల్లి మాజీ సర్పంచు మల్లికార్జున, మాజీ మండల కన్వీనర్ రాజశేఖర్‌గౌడ్, పోప్పుల రామాంజి, శీనప్ప, మాజీ వైస్ ఎంపిపి చిత్తప్ప, మాజీ సర్పంచు తిమ్మప్ప, రాయలదొడ్డి దోణతిమ్మా, రామదాసు, సుధాకర్, చెన్నేపల్లి విరుపాక్షిరెడ్డి, తీటకల్లు విజయ్, హనుమంతరాయుడు, కొట్టిండ్ల దోణతిమ్మ, వెంకటేష్, మాజీ ఎంపిటిసి లింగన్న, శాంతప్ప, తిమ్మరాజు, గుడిపల్లి గోవిందు, చిత్తప్ప, హనుమంతరాయుడు, భూతప్ప, నాగరాజు, నరసింహులు కిష్టయ్య, ముక్కన్న, రమేష్, సంతిమప్ప, కొడుకు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఉపకార వేతన పరీక్ష ప్రాథమిక కీ విడుదల

కొత్తచెరువు, డిసెంబర్ 06, ప్రభాతవార్త

ఈ నెల 03వ తేదిన జరిగిన జాతీయ ఉపకారవేతన పరీక్ష ప్రాథమిక కీని బుధవారం శ్రీసత్యసాయి జిల్లా డిఇఓ మీనాక్షి విడుదల చేశారు. ఈ కీకి సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 12వ తేదిలోపు గ్రీవెన్స్ లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో స్వీకరించబడునని డిఇఓ తెలియజేశారు. ఇందుకు సంబంధించివివరాలను http://www.bsc.ap.gov.in/ వెబ్‌సైట్ ద్వారా చూసుకోవాలని ఆమె తెలియజేశారు.

## మున్సిపల్ కార్యాలయంలో కుల గణన పై సమావేశం..

రాయదుర్గం, డిసెంబర్ 06 ప్రభాతవార్త:



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు..

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 9వ తేదీ నుండి నిర్వహించనున్న కులగణన సర్వే పై బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప మరియు మున్సిపల్ కమీషనర్ దివాకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కుల సంఘ పెద్దలు, కౌన్సిలర్లు కులగణన సర్వేను సచివాలయ పరిధిలో ఏ విధంగా చేయాలో క్లుప్తంగా వివరించారు. కుల సంఘ పెద్దలఉ మరియు కౌన్సిలర్లు ఇచ్చిన పలు సూచనలు తీసుకున్నారు. సచ్చివాలయ సిబ్బంది మరియు వార్డు వాలంటీర్లు ఈ నెల 9వ తేదీ నఉండి సచివాలయ పరిధిలో ప్రతి ఇంటికి వచ్చి కులగణన సర్వేను ప్రారంబిస్తారని, కావున కౌన్సిలర్ల కుల పెద్దలు, రాజకీయ నాయకులు సహకరించాల్సిందిగా తెలిపారు. ప్రజలు ఎటువంటి అనుమానాలకు తావు లేకుండా కులగణన సర్వేకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కుల సంఘ పెద్దలు, బిసి,ఎస్టి,ఎస్సీ హాస్టల్ల వార్డెన్లు మరియు అధికారులు పాల్గొన్నారు.

05ATP06_05ATP06.qxd 07-12-2023 AM 12:21 Page 1



# కేంద్ర నిధులతో రాష్ట్రం గొప్పలు - బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శన్

ఓబుళదేవరచెరువు, డిసెంబర్ 6, ప్రభాతవార్త : కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులతో ఏపి రాష్ట్ర ప్రభుత్వం తనే సొంతంగా నిధులు అందించి పథకాలను అమలు చేస్తున్న గొప్పలు చెప్పుకుని ఇచ్చి ఇమేజ్ పెంచుకుంటోందని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శన్ రాష్ట్ర సర్కార్ వ్యవహారశైలిపై మండిపడ్డారు. మండల కేంద్రంలో బుధవారం బిజెపి నాయకులు విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్ర అభివృద్ధి, పేదల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులతో వైసిపి ప్రభుత్వం అర్భాటంగా తామే అంతా చేస్తున్నట్లు ప్రభుత్వ పథకాలకు స్టికర్లను వేసుకుంటున్నారన్నారు. ప్రధాని నరే ంద్రమోది, నిధులు కేటాయించిన ఆ శాఖల కేంద్ర మంత్రులకు సంబంధించిన ఫోటోలు లేకుండా స్టిక్కర్లు వేసుకోవడం సరికాదన్నారు. అంతే కాకుండా రాష్ట్రంలో ఇసుకను కృత్రిమ కొరతగా సృష్టించి ఇష్టారాజ్యంగా ఇసుక దందా చేస్తున్నారని ఆరోపించారు. ఇసుక కొరత వల్ల భవన నిర్మాణం, సిమెంట్ , స్టీల్, పెయింటింగ్, ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్, వడంగ్రి తదితర విభాగాలకు చెందిన కార్మికులు ఉపాధిని కోల్పోయి రోడ్డున పడ్డారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అవినీతి అక్రమాలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాలపై వైసిపి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. భారతీయ జనతాపార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం కోసం త్వరలో మండల కమిటీలను నియమిస్తామ న్నారు. ఇప్పటికే బూత్ కమి టీలను నియమించడం జరిగిందన్నారు. బిజెపి పార్టీ బలోపేతానికి కమిటీ సభ్యులు దృష్టి సారించాలని ఆయన కమిటీ సభ్యులను కోరారు. ఈ సమావేశంలో జిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, మండల అధ్యక్షులు వెంకటరమణప్ప, జిల్లా కార్యవర్గ సభ్యులు సున్నంపల్లి రంగారెడ్డి, బోదెద్దులపల్లి ఆశ్వర్థప్ప, నాయకులు రాజశేఖర్; కిసాన్ మోర్చా అధ్యక్షులు వేమనారాయణ, జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బిజెపి నాయకులు

# పంట నష్టపరిహారం తుది జాబితా రూపకల్పన

అనంతపురం ఓల్డ్‌టౌన్, డిసెంబర్ 6 ప్రభాతవార్త

ఖరీఫ్ సీజన్‌లో పంట సాగు చేసి ప్రకృతి వైపరీత్యం వల్ల పంట నష్టపోయిన రైతుల తుది జాబితాను జిల్లా వ్యవసాయశాఖ అధికారులు తయారు చేసి పంట నష్టపరిహారం కోసం వ్యవసాయశాఖ కమీషనర్ కార్యాలయానికి రైతులు జాబితాను పంపినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ ఒక ప్రకటనలో తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించిన అనంతరం, కరువు వల్ల పంట నష్టపోయిన రైతుల తుది జాబితాను పంపించాలని ఆదేశించగా అందులో భాగంగా అనంతపురం జిల్లాలో 28 కరువు మండలాల్లో గ్రామస్థాయి, మండల స్థాయి, డివిజన్ స్థాయి అధికారులు ఈ పంట ఆధారంగా పంట నష్ట సర్వే నిర్వహించి తరువాత వాటి వివరాలను సామాజిక తనిఖీ నిమిత్తం రైతు భరోసా కేంద్రం వద్ద ప్రదర్శించడం జరిగిందని అందులో ఎటువంటి తప్పిదాలు వున్న వాటిని సంబంధించిన మండల స్థాయి కమిటీ పరిశీలించి సరి చేశామని తెలిపారు. పంట నష్టం అంచనాలో విధి విధానాలు అనుసరించి వర్షాభావ కారణంగా 33 శాతం కంటే అధికంగా దెబ్బతిన్న పంటలను, అలాగే ప్రతి చిన్న, సన్న కారు రైతుల పంట నష్టపోయింది పూర్తి విస్తీర్ణం అంటే 5 ఎకరాలకు మరియు పెద్ద రైతుకు పంట నష్టపోయిన విస్తీర్ణం గరిష్టంగా 5 ఎకరాల వరకు మాత్రమే పంట నష్టం అంచనా వేసి పంట నష్టపోయిన రైతుల జాబితాను సిద్ధం చేయడం జరిగిందని పేర్కొ న్నారు. దీనిని మండల స్థాయి, డివిజన్ స్థాయి కమిటీ ద్వారా తుది ప్రతిపా దనను జిల్లా స్థాయికి పంపామన్నారు. వీటిని క్రోడీకరించిన జిల్లా కలెక్టర్ ద్వారా 1.79 లక్షల హెక్టార్లలో పంట నష్టపోయిన 1.69 లక్షల మంది రైతులకు 251.20 కోట్ల రూపాయల పంట నష్టపరిహారం కోసం తుది నివేదికను వ్యవసాయ కమీషనర్ కార్యాలయానికి వివరాలు పంపామని తెలియచేశారు.

## వెనుకబడిన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బిఆర్.అంబేద్కర్

### - టిడిపి నియో జకవర్గ ఇన్‌చార్జ్ కందికుంట వెంకట ప్రసాద్

కదిరి టౌన్, డిసెంబర్ 6 ప్రభాతవార్త

వెనుకబడిన వర్గాల ఆశాజ్యోతి రాజ్యాంగ నిర్మాత డా.బిఆర్. అంబేద్కర్ అని టిడిపి నియోజ కవర్గ ఇన్‌చార్జ్ కందికుంట వెంకట ప్రసాద్ తెలిపారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం పట్టణంలో ఆయన విగ్రహ్యానికి పూలమాలలు వేసి కందికుంట వెంకట ప్రసాద్ నివాళులు అర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. అణగారిన వర్గాల భవిష్యత్తు ఏ రంగా ఉంటుందో ఆలోచన చేసుకున్న గొప్ప వ్యక్తి అంబేద్కర్ అని కొనియాడారు. ఈ తరమే కాదు భావి తరాలు కూడా అంబేద్కర్ ఆలోచన మేరకు జీవనం పాటించే పరిస్థితులు ఉంటా యన్నారు. యావత్ భారత ప్రజలు గర్వించ దగ్గ విషయమన్నారు. కులమతాల వ్యత్యాసం, ఆర్థిక అసమానతలు, స్వాతంత్ర్యం వచ్చిన నేటికీ ఉన్నాయని వారికి రక్షణగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు ఉన్నాయని తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక ఎస్సీ,ఎస్టీ, అ ట్రాసిటీ చట్టం మాదిరిగానే బిసిల చట్టం తీసుకొస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.




అంబేద్కర్ విగ్రహ్యానికి పూలమాలలు వేసి నివాలులు అర్పిస్తున్న కందికుంట

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

నల్లచెరువు, డిసెంబర్ 6, ప్రభాతవార్త:

మండల పరిధిలోని అల్లుగుండు గ్రామానికిచెందిన టోపి సాబ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో మృతుడి కుటుంభ సభ్యులకు ఆ గ్రామ వైసిపి సర్పంచ్ మరియు నాయకులు చేత తక్షణ సహాయం ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.మహేందర్‌రెడ్డి, ఎస్. రాజాబాబు, ఎస్. బందలకాజా,ఎస్. షఫీ, తదితరులు పాల్గొన్నారు.



మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న గ్రామసర్పంచ్

## వైఎస్సార్‌సిపి పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమం

### పేదల జీవితాల్లో మరిన్ని వెలుగులు నిండాలంటే సిఎంగా జగనన్నే కొనసాగాలి. వై ఏపి నీడ్స్ జగన్‌లో ప్రజాప్రతినిధులు.

అనంతపురం రూరల్, డిసెంబర్06ప్రభాతవార్త:

రాష్ట్రంలో వైఎస్సా ఆర్‌సిపి పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు చేరయాని మండల కన్వీనర్ గోవిందరెడ్డి,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ నాగేశ్వరరెడ్డి,వైఎస్ ఎంపిపి చియ్యేడు కృష్ణారెడ్డి,సర్పంచ్ ప్రశాంత్‌కుమార్,ఎంపిటిసి రాగే రేవతి పెద్దప్ప,ఉప సర్పంచ్ ఓబిలేసు పేర్కొన్నారు. బుధవారం అనంత రూరల్ మండలం కందుకూరు సచివాలయం1లో వై ఏపి నీడ్స్ జగన్ అనే కార్యక్రమం నాయకులు నిర్వహించి వైఎస్సా ఆర్‌సిపి జెండాను ఎగరవేశారు.అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పేదల జీవితాల్లో మరిన్ని వెలుగులు నిండాలంటే మరోసారి జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు ద్వారా4 లక్షల ఉద్యోగాలు భర్తీ చేసి జగన్‌మోహన్‌రెడ్డి యువతకు అండగా నిలిచారన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసి తన విశ్వసనీయత ఏమిటో జగన్‌మోహన్‌రెడ్డి చూపారన్నారు.కుల,మత,పార్టీలు చూడకుండా ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత తమ ప్రభుత్వానిదేన్నారు. గతంలో టిడిపి పాలనలో చంద్రబాబునాయుడు చేసిన మోసాలు మాత్రమే మనకు సాక్ష్యంగా నిలుస్తున్నాయన్నారు.ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు ఈశ్వరయ్య,రాఘవరెడ్డి,లింగమయ్య,చిన్న వెంకటప్ప, సుధీర్‌రెడ్డి, నరసింహరెడ్డి, పంచాయితీ కార్యదర్శి నరసింహరెడ్డి, సచివాలయ కన్వీనర్లు, గృహసారధులు,సర్పంచులు,ఎంపిటిసిలు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఏపికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు

## ఓపెన్ స్కూల్స్ ప్రవేశాలపై అవగాహన

అనంతపురం న్యూటౌన్, డిసెంబర్ 6 ప్రభాతవార్త

జిల్లా విద్యాశాఖ పరీక్షలు విభాగం అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ బుధవారం రెడ్డిపల్లిలో ఉన్న జిల్లా జైల్‌ను సందరిర్శంచడం జరిగింది. అక్కడ రిమాండ్‌లో ఉ న్న ఖైదీలకు ఓపెన్ స్కూల్ 10వ తరగతి, ఇంటర్ ప్రవేశాలు, పరీక్షలకు అవకాశం ఉంది అని, వారికి ప్రభుత్వం ఎలాంటి రుసుము లేకుండా అక్కడే పరీక్షలు నిర్వహించే విధంగా, అక్కడే పాఠాలు చెప్పించే అవకాశం ఉందని ఏసి తె లిపారు. ఇవే విషయాలను జిల్లా జైలు సూపరింటెండెంట్ షఫీ, ఉర్రహ్మాన్‌కి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జైలర్లు, డిప్యూటీ జైలర్లు పాల్గొన్నారు.



ఓపెన్ స్కూల్ పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అధికారులు

## తెలుగుదేశం పార్టీలోకి పలువురి చేరిక




పార్టీలోకి ఆహ్వానిస్తున్న కందికుంట వెంకట ప్రసాద్

కదిరి టౌన్, డిసెంబర్ 6 ప్రభాతవార్త

గండ్ల పెంట మండల పరిధి లోని వేపరాల గ్రామ పంచా యితీకి చెందిన పలువురు వైసీపీ నాయకులు వెంకట రెడ్డి, అశోక్, తరుణ్, కృష్ణ శేఖర్, రమేష్‌లు బుధవారం టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా కందికుంట మాట్లాడుతూ.. వైకాపా ప్రభుత్వ వైఫల్యాలకు విసిగిపోయి తెలుగుదేశం పార్టీలోకి వలసబాట పడుతున్నారని, పార్టీలోకి చేరిన వారందరికీ సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. పార్టీ అభివృద్ధికి పాటుపడాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, గాండ్లపెంట కన్వీనర్ కొండయ్య, నాయకులు ప్రసాద్, అంజినాయక్, రవికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బిఆర్ అంబెద్కర్ 67 వర్ధంతి వేడుకలు

నల్లచెరువు, డిసెంబర్ 6, ప్రభాతవార్త:

మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ ఆవరణంలో ఏర్పాటు చేసిన అంబెద్కర్ విగ్రహానికి ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షు లు భరత్‌కుమార్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి పాలాభిషేకం చేసి ఘనంగా వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజా ్యంగ నిర్మాత మన దేశ ప్రజాస్వామ్య స్ఫూర్తిని నిలదక్కుల వ్యాపిం పచేసి అసమానతలు లేని సమాజం కోసం అనునిత్యం పరితపించి భారత రాజ్యాం గానికి ప్రాణం పోసిన ప్రపంచ మేధావి భారతరత్న డాక్టర్ బిఆర్ అంబెద్కర్ అని అన్నారు. ఆయన అడుగుజాడల్లో నడవాలని వారు కోరారు.



అంబెద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

## 576 టెట్రా ప్యాకెట్ల మద్యం స్వాధీనం

ఓబుళదేవరచెరువు, డిసెంబర్ 6, ప్రభాతవార్త : మండల పరిధిలోని సున్నంపల్లి క్రాస్ వద్ద బుధవారం ద్విచక్ర వాహనంలో మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి 576 టెట్రా ప్యాకెట్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సిఐ శ్రీధర్ తెలిపారు. నల్లమాడ మండలం వంకరకుంట గ్రామానికి చెందిన సాకే రమణప్ప అనే వ్యక్తి అక్రమంగా కర్నాటక రాష్ట్రం నుంచి తీసుకువస్తుండగా సున్నంపల్లి క్రాస్ వద్ద అతని న్ని సోదా చేశామన్నారు. అతని వద్ద నుంచి 576 టెట్రా ప్యాకెట్ల మద్యం ఉన్నట్లు గుర్తించి అతనిపై కేసు నమోదు చేసి ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని సిఐ వెల్లడించారు.

## సైనిక్ స్కూల్స్ ప్రవేశ పరీక్షకు ఫీజు చెల్లించండి

అనంతపురం న్యూటౌన్, డిసెంబర్ 6 ప్రభాతవార్త

2024-25 విద్యా సంవత్సరానికి దేశ వ్యాప్తంగా 33 సైనిక పాఠశాలలు ప్రారంభంలో ఉన్నాయని ఇ ందులో 6, 9 తరగతి ప్రవేశానికి ఎన్‌టిఎ ఆల్-ఇండియా సైనిక్ స్కూల్ ఎం ట్రన్స్ ఎగ్జామినేషన్ (ఎఐఎస్‌ఎస్‌ఈఈ)-2024 పరీక్ష జనవరి 21న ఆదివారంన నిర్వహిస్తారని డిఇఒ వి.నాగరాజు బుధవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. సైనిక్ పాఠశాలలు సిబిఎస్‌ఇకి అనుబంధంగా ఉన్న ఇంగ్లీష్ మీడియం రెసిడెన్షియల్ పాఠశాలలు, నేషనల్ డిఫెన్స్ అకాడమీ, ఇండియన్ నేవీ అకాడమీ, ఇతర రక్షణ/శిక్షణా అకాడమీలలో ప్రవేశం కోసం క్యాడెట్లను సిద్ధం చేస్తారన్నారు. రక్షణ శాఖ 19 కొత్త సైనిక్ పాఠశాలలను ప్రారంభిస్తుందని, అవి ఎన్జిఓ/ప్రైవేట్ పాఠశాలు/రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పనిచేస్తాయని, అవి సైనిక్ స్కూల్స్ సొసైటీ ఆధ్వర్యంలో కొత్త సైనిక్ స్కూల్స్‌ను 2024-25 విద్యా సంవత్సరానికిగానూ ప్రారంభిస్తారని తెలిపారు. అర్హతకోసం నిర్వహించు ప్రవేశ పరీక్ష ఓఎంఆర్ షీట్ల ఆధారంగా ఉంటుందని, 6వ తరగతిలో ప్రవేశానికి అర్హత అభ్యర్థికి 2024 మార్చి 31 నాటికి 10 సంవత్సరాల నుంచి 12 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. 9వ తరగతిలో ప్రవేశానికి అర్హత అభ్యర్థికి మార్చి 31-2024 నాటికి 13 న ఉంచి 15 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. అడ్మిషన్ సమయంలో గుర్తింపు పొందిన పాఠశాల నుంచి 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. బాలికల అడ్మిషన్ 9వ తరగతికి తెరవబడుతుందన్నారు. విద్యార్థులు పరీక్ష రుసుమును ఈ నెల 16వ తేదీలోపు చెల్లించాలన్నారు. జనరల్ కేటగిరి వారు రూ.650, షెడ్యూల్డ్ కులాలు/షెడ్యూల్డ్ తెగలు రూ.500 చొప్పున ఆన్లైన్ గేట్‌వే ద్వారా చెల్లించాలని, డెబిట్/క్రెడిట్‌కార్డు లేదా ఇ ంటర్నెట్ బ్యాంకింగ్ /యుపిఐ ద్వారా చెల్లించవచ్చునని తెలిపారు.

## బడుగు, బలహీనవర్గాల అశాజ్యోతి డాక్టర్ బిఆర్ అంబేద్కర్

### - ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రిఅర్బన్, డిసెంబర్ 6 ప్రభాతవార్త

బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 67వ వర్థంతిని పురస్కరించుకుని బస్టాండ్ సర్కిల్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే కేతిరెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పెద్దారెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్ అంటరాని తనం నిర్మూలనకు ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేశారన్నారు. అంబేద్కర్ సిద్ధాంతాలను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. అంబేద్కర్ అందరికి సమాన విద్య, ఆరోగ్య, ఉపాధి, రక్షణ, నివాసం మరియు భావ ప్రకటనకు సమన్యాయం రాజ్యాం గంలో పొందుపరిచారన్నారు. ఆయన పేద ప్రజలను దృష్టిలో వుంచుకుని రాజ్యాంగాన్ని రచించారన్నారు. భారతదేశానికి ఆయన చేసిన సేవలను ఎమ్మెల్యే కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

## యాడికిలో తాగునీటి ట్యాంకు ప్రారంభం

యాడికి, డిసెంబర్ 6 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని కొండకింద 2,3 వార్డుల్లో తాగునీటి వసతి లేక ఇబ్బంది పడుతున్నామని గత కొన్ని రోజుల క్రితం స్థానికులు తేదేపా తాడిపత్రి నియోజకవర్గం ఇన్‌చార్జ్ జె.సి అశ్మిత్‌రెడ్డికి తెలియచేశారు. దీంతో బోరు వేయించి ట్యాంకును ఏర్పాటు చేయించారు. బుధవారం జె.సి అశ్మిత్‌రెడ్డి, స్థానికులతో కలిసి నీళ్ల ట్యాంకు వద్ద టెంకాయ కొట్టి రిబ్బన్ కత్తిరించి ట్యాంకును ప్రారంభించారు. అడిగిన వెంటనే నీటి వసతిని కల్పించి తమ సమస్యను పరిష్కరించిన జె.సి అశ్మిత్‌రెడ్డిని కాలనీవాసులు సన్మానించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్య క్రమంలో తేదేపా, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



తాగునీటి ట్యాంకును ప్రారంభిస్తున్న దృశ్యం

## ఘనంగా అంబేద్కర్ వర్ధంతి వేడుకలు

యల్లనూరు, డిసెంబర్ 6 ప్రభాతవార్త

మండల కేంద్రంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు డాక్టర్ అంబేద్కర్ 67వ వర్ధంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాతగా దేశ ఔన్నత్యాన్ని ప్రజాస్వామ్య స్ఫూర్తిని విశ్వవ్యాప్తం చేసిన మహోన్నత కీర్తి శిఖరం భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని కొనియా డారు. ఆయన అడుగు జాడల్లో నడుస్తూ రాజ్యాంగ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకుళ్లాలని వారు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ పిఎస్ నాయకులు బాల నరసింహులు, ఓబులేసు, నాగభూషణం, మనో హర, శంకర్, వెంకటేష్, సుధాకర్‌నాయక్, గుర్రప్ప, తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

## వెంకటాంపల్లిలో బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ

### - హాజరైన జె.సి అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రిరూరల్, డిసెంబర్ 6 ప్రభాతవార్త

మండలంలోని వెంకటాంపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ తాడిపత్రి నియోజకవర్గం ఇన్‌చార్జ్ జె.సి అశ్మిత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలను ఆప్యాయంగా పలుకరిస్తూ యోగక్షేమాలు, వారి స్థితిగతులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, జె.సి అనుచరులు, అభిమానులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులను పలుకరిస్తున్న జె.సి అశ్మిత్‌రెడ్డి

## ఘనంగా శ్రీఅయ్యప్పస్వామి గ్రామోత్సవం

యల్లనూరు, డిసెంబర్ 6 ప్రభాతవార్త

మండలంలోని కోడుమూర్తి గ్రామంలో శ్రీఅయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని బుధవారం మేళతాళాల మధ్య ఘనంగా నిర్వహించారు. అయ్యప్పస్వామి మాలదారులు గురువు గురుస్వామి ఆధ్వర్యంలో నాగార్జున స్వామి ఇంటి వద్ద నుండి శ్రీఅయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరి ంచి గ్రామోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు.



గ్రామోత్సవంలో పాల్గొన్న అయ్యప్పస్వామి మాలదారులు

## ఇంటి నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసుకోవాలి

### - రాష్ట్ర హౌసింగ్ కార్పోరేషన్ డైరెక్టర్

అమడగూరు, డిసెంబర్ 6 ప్రభాతవార్త

మండలంలోని మహమ్మదాబాద్ పంచాయతీలో రాష్ట్ర హౌసింగ్ కార్పోరేషన్ డైరెక్టర్ శేషురెడ్డి బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన జగనన్న ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసుకోవాలన్నారు. చేర్పులు, మార్పులు వుంటే ఉన్నతాధికారుల సూచనల మేరకు మార్పులు చేసుకోవచ్చన్నా రు. బిల్లులు పెండింగ్‌లో వున్న లబ్దిదారులు ఆయా సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఏఇని సంప్రదించాలని ఆయన లబ్దిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సురేష్, ఎంపిటిసి నాగరాజు, సచివాలయం కన్వీనర్ జయప్ప, హౌసింగ్ ఎఇ రాఘవేంద్ర, ఇంజనీరింగ్ అసిస్టెంట్ జ్యోతి, మాజీ సర్పంచు లోకేష్‌రెడ్డి, డీలర్ పురుషోత్తంరెడ్డి, గోపాల్‌రెడ్డి, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



నిర్మాణంలో వున్న ఇళ్లను పరిశీలిస్తున్న అధికారులు

## .ఘనంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతి వేడుకలు

అమడగూరు, డిసెంబర్ 6 ప్రభాతవార్త

మండలంలోని మహమ్మ దాబాద్ గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతి వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లా డుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తన జీవితాన్ని అణగారిన వర్గాల సంక్షేమానికి అంకితం చేశారన్నా రు. రాజ్యాంగ నిర్మాతగానే కాకుండా సామాజిక సామరస్యానికి చేసిన కృషిని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో టైలర్ జయరాం, డాక్టర్ రవికుమార్, తిరుపాల్, లైన్‌మెన్ శ్రీనివాసులు, శ్రీనివాసులు, నరసింహులు, రామాంజులు, నాగప్ప, శ్రీనివాసులు, అంజినప్ప, నరసింహులు, రామయ్య, కిష్టప్ప, తదితరులు పాల్గొన్నారు.

## రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో మాలదారులకు భిక్ష

తాడిపత్రిఅర్బన్, డిసెంబర్ 6 ప్రభాతవార్త

కార్తీకమాసం పురస్కరించుకుని శివమాల, అయ్యప్ప స్వామి మాల ధరించిన మాలదారులకు వైకాపా రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి ఆధ్వర్యం లో ప్రతి రోజు భిక్ష ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో మాలదారులకు భిక్ష ఏర్పాటు చేశారు. ముందుగా మాలదారులు శ్రీఅయ్యప్ప స్వామి కి అర్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి అనంతరం భిక్షలో పాల్గొన్నారు. హాజరైన మాలదారులకు రమేష్‌రెడ్డి స్వయంగా భోజనం వడ్డించారు. వందలాది మంది మాలదారులో భిక్షలో పాల్గొన్నారు.



భిక్షలో పాల్గొన్న మాలదారులు

## అంబేద్కర్ ఆశయాలకు పాటుపడదాం

తాడిపత్రిఅర్బన్, డిసెంబర్ 6 ప్రభాతవార్త

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలకు పాటుపడదామని టిడిపి మున్సిపల్‌వైస్‌చైర్మన్లు, కౌన్సిలర్లు పేర్కొన్నారు. అంబేద్కర్ వర్ధంతిని పురస్కరిం చుకుని ఆర్టీసి బస్టాండ్ సర్కిల్ లోని అంబేద్కర్ విగ్రహానికి వారు బుధవారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కులాల వివక్షతను కూకటివేళ్లతో పెకలించడం కోసం అలుపెరుగని పోరాటం చేశారన్నారు. భారత రాజ్యాంగాన్ని రచించి దేశానికి దిశా నిర్దేశం చూపి నటువంటి మహా గొప్ప వ్యక్తి అని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్లు అబ్దు ల్‌రహీం, పి.సరస్వతి, కౌన్సిలర్లు కె.మల్లికార్జున, షెక్షావలి, తదితరులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న వైస్‌చైర్మన్లు, కౌన్సిలర్లు

## ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్‌కు ఘననివాళి

యాడికి, డిసెంబర్ 6 ప్రభాతవార్త

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 67వ వర్థంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని అంబేద్కర్ విగ్రహానికి ఎంఆర్‌పిఎస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన జాతికి చేసిన సేవలను కొనియాడారు. ఆయన వర్ధంతిని ప్రతి ఏటా మహాపరినిర్వాన్ దివస్‌గా జరుపుకుంటున్నామని, దేశంలోని అణగారిన వర్గాల ఆర్థిక, సామాజిక, సాధికారితకు అంబేద్కర్ చివరి వరకు పోరాటం చేశారని పుల్లయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయమ్మ, ఉపాధ్యాయులు, ఎంఆర్‌పిఎస్ నాయకులు శ్రీరాములు, సూర్యుడు, కుళ్లాయప్ప, ఆదినారాయణ, గిరి, టైలర్ పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

## వైసిపితోనే సంక్షేమ పాలన

### - వైసిపి పట్టణాధ్యక్షులు జావిద్‌ఖాద్రీ

తాడిపత్రిఅర్బన్, డిసెంబర్ 6 ప్రభాతవార్త

వైసిపితోనే సంక్షేమ పాలన సాగుతోందని వైసిపి తాడిపత్రి పట్టణాధ్యక్షులు జావిద్‌ఖాద్రీ పేర్కొన్నారు. పట్టణంలోని సంజీవనగర్ రోడ్డు సచివాలయంలో బుధవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలని కార్య క్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్య క్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరిగిందన్నారు. ఇందులో భాగంగా సచివాలయం పరిధిలో లబ్దిదారులకు 12,11,75,661 రూపాయలు ప్రత్యక్షంగా, పరోక్షంగా 5,18,62,448 రూపాయలు మొత్తం 17,30,38,109 రూపాయల లబ్ది చేకూరిందన్నారు. గత ప్రభుత్వం ఏనాడూ చేయనివిధంగా మన వైసిపి ప్రభుత ్వం చెప్పిన మాట నిలబెట్టుకున్న ప్రభుత్వమని, సంక్షేమ ఫలాలు నేరుగా ప్రజల వద్దకే చేరువేస్తున్న ఏకైక నాయకుడు మన జగనన్న అని ఆయన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బాబయ్య, వాసు, గురుశంకర్, మనోజ్, కృష్ణయ్య, మహానంది, వైసిపి యువనాయకులు, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న జావిద్‌ఖాద్రీ

## తంగుటూరు క్రిష్ణమోహన్‌ను కలిసిన మాజీ ఎంపి జె.సి

తాడిపత్రిఅర్బన్, డిసెంబర్ 6 ప్రభాతవార్త

పట్టణంలోని తంగుటూరు జ్యువెలర్స్ అధినేత తంగుటూరు క్రిష్ణమోహన్‌ను బుధవారం మాజీ ఎంపి జె.సి దివాకర్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా తంగుటూరు క్రిష్ణమోహన్‌తో జె.సి దివాకర్‌రెడ్డిమాట్లాడుతూ యోగక్షేమాలను అడిగి తెలుసు కున్నారు.



తంగుటూరు క్రిష్ణమోహన్‌తో మాట్లాడుతున్న జె.సి దివాకర్‌రెడ్డి

## వేలం పాట వాయిదా

తాడిపత్రిరూరల్, డిసెంబర్ 6 ప్రభాతవార్త

మండలంలోని ఆలూరుకోనలో తలనీలాలు, కళ్యాణమండపం, వసతిగదులు, సత్రములు, గెస్ట్‌హౌస్ లీజు, హోటల్ నిర్వహణ, టెంకాయలు మరియు పూజాసామాగ్రి, కూల్‌డ్రింక్స్, ఫోటోలు, బొమ్మల అమ్మకంకు సంబంధించి వేలం పాట ఈ నెల 14వతేదీకి వాయిదా వేసినట్లు ఆలయ ఇఒ సుబ్రమణ్యం తెలియచేశారు. బుధవారం జరగాల్సిన వేలంపాటకు ఎవరూ హాజరుకాకపోవడంతో వేలంపాటను వాయిదా వేసినట్లు ఇఒ తెలిపారు.

## మండలంలో 67వ డా. బిఆర్ అంబేద్కర్ వర్ధంతి వేడుకలు

నల్లచెరువు, డిసెంబర్ 6, ప్రభాతవార్త:

మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం-1 నందు బుధవారం గ్రామ సచివాలయం నందు సిబ్బంది గ్రామ సర్పంచ్ పంచరత్నమ్మ ఆధ్వర్యంలో బాబా సాహెబ్ చిత్రపటా నికి పూలమాలలు వేసి ఘనంగా వర్ధంతి వేడుకలు నిర్వహంచారు. ఈ సందర్భంగా సర్పంచ్ పంచరత్నమ్మ మాట్లాడుతూ దేశ మహోన్నత రాజ్యాంగ నిర్మాత అంబెద్కర్ బడుగు, బలహీన వర్గాల, రాజకీయ విద్యరంగాలలో చైతన్యాన్ని నింపారని, అంటరానితనం లేని సమాజం కోసం అహర్నిశలు కృషి చేశారని, అందరికీ ఓటు హక్కు కావాలని పోరాటం చేసి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించిన మహోన్నత వ్యక్తి అంబెద్కర్ అని, ఆయన సాధన కోసం విద్యార్థులు, యువత పాటుపడాలని, ఆయన అడుగు జాడల్లో నడవాలన్నారు. డాక్టర్ బిఆర్ అంబెద్కర్ మనదేశానికి వెన్నెముక లాంటి మహోన్నత వ్యక్తిగా నిలిచారని తెలిపారు. ఈ వర్ధంతి కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ విష్ణువర్ధన్, సచివాలయసిబ్బంది, వాలంటీర్‌లు, పాల్గొన్నారు.



అంబెద్కర్‌కు ఘన నివాళులు అర్పిస్తున్న సర్పంచ్ పంచరత్నమ్మ

